

మహిళలు స్వతంత్రంగా బతకడం నేర్చుకోవాలి. స్వతంత్రం అంటే ఇష్టమొచ్చినట్లు బతకడం కాదు. ఆర్థికంగా, వృత్తిపరంగా, సామాజికంగా స్వతంత్రంగా బతకడం.. ఎదగడం. అప్పుడే సమాజంలో సమాన గౌరవం దక్కుతుంది..... అంటున్నారు చిత్తూరు జిల్లా అటవీశాఖాధికారిణి భరణి.

- 8 నెలల గర్భిణిగా ఉంటూ సివిల్స్ పరీక్ష
- 20 రోజుల బాబును వదిలి ఇంటర్వ్యూకు
- ఐదవ ప్రయత్నంలో ఐఎఫ్ఎస్ సాధన
- చిత్తూరు డీఎఫ్‌వో భరణి విజయప్రస్థానం



నేడు మహిళా దినోత్సవం

రష్యాలోని ఎత్తయిన పర్వతం మౌంట్ ఎల్బ్రస్‌పై భరణి

డెలివరీ తేదీ.. సివిల్స్ ఇంటర్వ్యూ తేదీ ఒకటే

నాలుగుసార్లు సివిల్స్‌కు ప్రయత్నించి విఫలమైన భరణికి 2018లో నరేంద్రన్‌తో వివాహమైంది. 2019లో సివిల్స్ మెయిన్స్ పరీక్ష రాసే సమయానికి ఆమె 8 నెలల గర్భిణి. అందులో విజయం సాధించిన ఆమెకు ఇంటర్వ్యూకు హాజరవ్వాలని లెటర్ వచ్చింది. ఇంటర్వ్యూ తేదీ, వైద్యులు ఇచ్చిన డెలివరీ తేదీ ఒకటే కావడంతో యూపీఎస్సీ వారిని సంప్రదించి చివరి స్లాట్ కేటాయించాలని కోరారు. 2020 జనవరి 21న బాబుకు జన్మనిచ్చారు. సరిగ్గా 20 రోజుల తర్వాత అంటే, ఫిబ్రవరి 14వ తేదీన ఢిల్లీలో సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. తర్వాత ఆరు నెలల బాబును ఇంట్లో వదిలేసి రెండేళ్ల పాటు శిక్షణకు వెళ్లాల్సి వచ్చింది.

పెళ్లయిపోయిందని ఊరుకోలేదు!

చిత్తూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):సాధారణంగా మహిళలు ఏదైనా సాధించాలంటే అనేక ఆంక్షలు అడ్డుపడుతుంటాయి. ఓ వయసొచ్చాక పెళ్లి చేసేయాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తుంటారు. పెళ్లయ్యాక పిల్లలు కావాలని అత్తారింటి నుంచి ఒత్తిడి ఉంటుంది. ఇలాంటి అవరోధాలన్నింటినీ అధిగమించి.. సివిల్స్‌లో ర్యాంకు సాధించారు భరణి.ఆర్మీ అధికారి సద్గురుస్వామి, ప్రైవేటు టీచర్ పద్మ దంపతుల కుమార్తె అయిన భరణి తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్శిటీలో బీఎస్సీ పూర్తి చేశారు. విద్యార్థి దశలో ఎన్‌సీసీలో చేరి సీనియర్ అండర్ ఆఫీసర్ స్థాయికి ఎదిగారు.తన కుటుంబానికి సంబంధించి మూడు తరాలు ఆర్మీలో పనిచేసి వుండడంతో ఆమెకు కూడా యూనిఫాం వేసుకోవాలనే కోరిక ఉండేది.ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్ అనేది ఆమె కల.దీంతో డిగ్రీ పూర్తయిన వెంటనే ఎయిర్‌ఫోర్స్‌కు దరఖాస్తు చేశారు. 2016లో తొలి ప్రయత్నంలోనే ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని పొందారు.అయితే ఐ సైట్ సరిపోకపోవడంతో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా అర్హత సాధించలేకపోయారు.లాజిస్టిక్స్ విభాగంలో ఉద్యోగాన్నివ్వడంతో తండ్రి సూచన, సపోర్టుతో సివిల్స్ వైపు దృష్టి సారించారు.నాలుగు ప్రయత్నాలు విఫలమైనా ఐదవసారి సివిల్ సర్వెంట్‌గా ఎంపికయ్యారు. అప్పటికే భర్త నరేంద్రన్ డీఎఫ్‌వోగా పని చేస్తుండడంతో, తానూ ఐఎఫ్ఎస్ ఎంపిక చేసుకున్నారు. కాకినాడ, రాజమండ్రి ప్రాంతాల్లో పనిచేసిన ఆమె ఇటీవలే చిత్తూరు డీఎఫ్‌వోగా బదిలీపై వచ్చారు.

పర్వతారోహణ ప్యాషన్

ఉద్యోగ విధుల్ని నిర్వర్తిస్తూనే తనకు ఇష్టమైన పర్వతారోహణను ఎంజాయ్ చేస్తున్నారు భరణి. గతేడాది మహిళా దినోత్సవాన ఆఫ్రికాలోని అత్యంత ఎత్తైన పర్వతం కిలిమంజారోను.. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు రష్యాలోని ఎత్తయిన పర్వతం మౌంట్ ఎల్బ్రస్‌ను అధిరోహించారు.



అధ్యక్షా..

మండలానికో అంబులెన్స్ సర్వీసు కావాలి

ప్రతి మండలానికీ ఒక అంబులెన్స్ సర్వీసు ఉండేలా ప్రభుత్వం చూడాలి. మా జీడీనెల్లూరు నియోజకవర్గంలో అంబులెన్స్ సర్వీస్ కొరత ఎక్కువగా ఉంది.ప్రజలంతా పేదవారు కావడంతో అంబులెన్స్ సర్వీస్‌కు డబ్బులు చెల్లించే పరిస్థితిలో లేరు. రీసెంట్‌గా వెదురుకుప్పం మండలంలో టీడీపీ కార్యకర్త ఒకరు రోడ్డు ప్రమాదానికి గురై అంబులెన్స్ సర్వీసు సకాలానికి రాక అక్కడికక్కడే మృతి చెందారు.మా నియోజకవర్గంలో యాభై పడకల ఆస్పత్రి కూడా అందుబాటులో లేదు.చిత్తూరుకో, తిరుపతికో క్షతగాత్రులను తరలించే లోపు ప్రాణాలు పోతున్నాయి.అత్యవసర వైద్యాన్ని క్షతగాత్రులకు అందించాలంటే అవసరమైన అంబులెన్స్ సర్వీసులు వెంటనే అందుబాటులోకి తీసుకొచ్చే చర్యలు చేపట్టాలి.



-వీఎం థామస్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

టెన్త్ పరీక్షల్లో పొరబాట్లు జరిగితే
క్రిమినల్ కేసులు

- ఓపెన్ పరీక్షలు సవాల్‌గా మారాయన్న ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు సెంట్రల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి):టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకుంటే కారకులపై క్రిమినల్ కేసులు పెడతామని విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ హెచ్చరించారు. శుక్రవారం చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, సెంటర్, స్టోరేజ్ పాయింట్ కస్టోడియన్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఏ పొరబాటు చోటు చేసుకున్నా అందుకు చీఫ్ డిపార్టుమెంటల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సెంటర్లలో చీఫ్ మినహా, నాన్ టీచింగ్, ఇతరులెవరైనా అజమాయిషీ చేయడానికి ప్రయత్నం చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.సెంటర్‌లో ఉన్నవారికి ఖచ్చితంగా గుర్తింపు కార్డు ఉండాలని, లేని అటెండర్‌ను సైతం కేంద్రానికి దూరంగా ఉంచాలన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైనా, సిబ్బంది మాత్రం 8 గంటలకే విధుల్లో ఉండాలన్నారు. 8.30 గంటల తర్వాతే పోలీసు స్టేషన్ నుంచి బండిళ్ళు తీసుకోని పరిశీలన చేసుకోవాలన్నారు. 9.15 గంటలకు మాత్రమే సెంటర్‌లో బండిళ్ళు తెరవాలన్నారు. నాలుగు అడుగుల డెస్క్‌లో ఒక్క విద్యార్థి మాత్రమే ఉండాలని, ఎక్కడైనా ఇద్దరు కూర్చున్నట్లు గుర్తిస్తే, సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలతో పాటు 17 నుంచి నిర్వహించే టెన్త్ ఓపెన్ పరీక్షల నిర్వహణ విద్యాశాఖకు సవాలుగా మారిందన్నారు.విద్యార్థులను పాస్ చేయిస్తామంటూ కొంతమంది పరీక్షా కేంద్రాల కోఆర్డినేటర్లు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు.వాటిని పలువురికి పంచి, అడ్డదారులకు పాల్పడేలా ప్రోత్సహిస్తున్నారన్నారు.అయితే అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం డీఆర్వో మోహన్ కుమార్ ఆధ్వర్యంలో పరీక్షల నియమావళిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్ వెంకటేశ్వరరెడ్డి, డీవైఈవోలు బాలాజీ, ప్రభాకర్, సీఎస్, సీడీలు, పరీక్ష విధులకు హాజరయ్యే టీచర్లు పాల్గొన్నారు. అంతకుముందు డీఈవో కార్యాలయంలో టీచర్ల సీనియారిటీ జాబితా తయారీలో పురోగతిపై ఆయా సెక్షన్ల సిబ్బందితో సమీక్షించారు.

నేడూ రేపు అభ్యంతరాల స్వీకరణ

టీచర్ల సీనియారిటీ జాబితాలోని అభ్యంతరాలను సెలవు రోజులైన శని, ఆదివారాల్లోనూ డీఈవో కార్యాలయంలో స్వీకరించనున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. కాగా జాబితా తయారీలో చోటు చేసుకున్న తప్పులను సవరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు ఆర్జేడీ శామ్యూల్‌కు వినతి పత్రం అందించారు.

బ్యాంకుల్లో తగిన నియామకాలు చేపట్టాలి

- యూఎఫ్‌బీయూ నాయకుల డిమాండ్



ఇండియన్ బ్యాంకు కొంగారెడ్డిపల్లె బ్రాంచ్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో తగిన నియామకాలు చేపట్టి.. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలంటూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం చిత్తూరులోని కొంగారెడ్డిపల్లెలో ఉన్న ఇండియన్ బ్యాంకు బ్రాంచ్ ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. వారంలో ఐదురోజుల బ్యాంకింగ్ అమలు, ఉద్యోగాల ఔట్‌సోర్సింగ్ నిలుపుదల, తదితర సమస్యలను పరిష్కరించాలని చిత్తూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు టి.శేఖర్, కార్యదర్శి పి.విజయ్‌భాస్కర్ కోరారు. లేదంటే ఈనెల 24, 25 తేదీల్లో యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్త బ్యాంకింగ్ సమ్మె చేపడతామని హెచ్చరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ నాయకులు విజయభాస్కర్, గంగిరెడ్డి, యోగేష్, ఆర్.అనిల్‌కుమార్, ఏకే శ్రీహరి, మునిరెడ్డి, సెల్వం, విఘ్నేష్ ప్రభుత్వ, సహకార, గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టైలరింగ్‌లో శిక్షణ తీసుకోవడానికి ఆసక్తి కలిగిన కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు చెందిన మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు, జీడీ నెల్లూరు, నగరి నియోజకవర్గాలకు ప్రభుత్వం 5,333 యూనిట్లను మంజూరు చేసిందన్నారు. ఒక్కో శిక్షణ కేంద్రంలో 500 మందికి మహిళలకు శిక్షణ ఇస్తారని చెప్పారు. 21-50 ఏళ్ల మధ్య ఉన్నవారు కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఒక్కో యూనిట్‌కు సరాసరి టైలరింగ్ మిషన్, శిక్షణకు కలిపి రూ.25వేల సబ్సిడీని ఇస్తుందన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఎంపీడీవో, కమిషనర్ల సహకారంతో https://apobmms.apcfss.in/BeneficiaryRegFormTTC అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఏఈవో బాబురెడ్డిని సెల్ నెంబరు 99081 32043లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 632మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 14,256 మంది విద్యార్థులకు 13,624 మంది హాజరవగా, 632 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్‌మౌలా తెలిపారు. జనరల్ ఇంటర్‌లో 12,455 మందికి 11,915 మంది హాజరవగా, 540 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 1801 మందికి 1,709 మంది హాజరవగా, 92 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ఓపెన్ పరీక్షలకు 588 గైర్హాజరు

ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం రసాయన, ఆర్థిక, సామాజిక శాస్త్ర సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 3020 మంది విద్యార్థులకు 2432 మంది హాజరవగా, 588 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్, ఏడీ వెంకటేశ్వరరావు తెలిపారు. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 11 పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

- పరీక్షలు జరిగే రోజుల్లో హాల్‌టికెట్ చూపి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు

వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 17 నుంచి నెలాఖరు వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏ విధమైన బస్సు పాసులు లేకపోయినా హాల్ టికెట్ చూపితే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. పరీక్షలు జరిగే రోజుల్లో మాత్రమే ఉచిత ప్రయాణానికి బస్సుల్లో అనుమతిస్తారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు లీగల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి తెలిపారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరసిద్ధుడి ఆలయ ప్రధాన అర్చకుడిపై
సస్పెన్షన్ ఎత్తివేత

ఫిర్యాదుదారుడి సమక్షంలో విచారణ చేపట్టాలని దేవదాయశాఖకు సూచించిన హైకోర్టు



సోమశేఖర్

ఐరాల(కాణిపాకం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌పై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేయాలని హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. సోమశేఖర్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం పొందారని దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు గత ఏడాది అక్టోబరు 28వ తేదీన ఓ న్యాయవాది ఫిర్యాదు చేశారు. అప్పటి ఆలయ ఈవో నివేదికల ఆధారంగా సోమశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. దీనిపై సోమశేఖర్ హైకోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్నాక సోమశేఖర్ గురుకుల్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఫిర్యాదుదారుడి సమక్షంలో విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ అధికారులకు సూచిస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చింది. దీనిపై ఆలయ ఈవో పెంచలకిషోర్‌ను వివరణ కోరగా.. సోమశేఖర్ గురుకుల్‌పై విధించిన సస్పెన్షన్ ఎత్తి వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు స్పష్టం చేశారు. ఆయన్ను ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగిస్తూ.. వెంటనే విధుల్లోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.

వడగాడ్పులు మొదలయ్యాయి



బోసిపోయిన ఎమ్మెస్సార్ సర్కిల్



స్కార్ఫ్ సాయంతో..



గొడుగునీడన చంటిబిడ్డతో..

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):మార్చి తొలివారంలోనే ఎండలు మండుతున్నాయి. వడగాడ్పులూ మొదలయ్యాయి. మరో మూడునెలలు తీవ్రమైన వడగాడ్పులు వీస్తాయన్న వాతావరణ నిపుణుల హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 39.1 డిగ్రీల వరకు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా తవణంపల్లెలో 39.1, అత్యల్పంగా రామకుప్పంలో 33.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా.. గంగవరంలో 38.6, పులిచెర్లలో 38.1, చిత్తూరు, గుడిపాల, నగరిలో 38, నిండ్ర, శ్రీరంగరాజపురంలో 37.7, ఐరాల, గుడుపల్లె, శాంతిపురంలో 37.2, గంగాధరనెల్లూరులో 37.1, రొంపిచెర్లలో 36.8, వి.కోటలో 36.7, చౌడేపల్లె, పాలసముద్రం, విజయపురంలో 36.4, పెద్దపంజాణిలో 36.3, యాదమరిలో 36.2, బంగారుపాళ్యంలో 35.9, కుప్పం, పూతలపట్టులో 35.6, పెనుమూరులో 35.3, సదుం, వెదురుకుప్పంలో 35.1, సోమలలో 35, పలమనేరులో 34.9, బైరెడ్డిపల్లెలో 34.5, కార్వేటినగరంలో 34.3, పుంగనూరులో 34.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : 6.28
సహరి (ఆదివారం) : 5.05

మౌర్య ఐఏఎస్

డిగ్రీ తర్వాత ఐదేళ్ల శ్రమ ఫలితం ఈ హోదా. సివిల్స్ ప్రయత్నంలో నాలుగుసార్లు అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోయాయి. ప్రతి వైఫల్యమూ ఒక కొత్త పాఠమే నేర్పింది. చిన్నవయసులో నాన్న చెప్పిన మాటలే లక్ష్యంవైపు నడిచేందుకు స్ఫూర్తిని రగిలించాయి. ఐదో ప్రయత్నంలో 100వ ర్యాంకు సాధించారు మౌర్య. ప్రస్తుతం తిరుపతి నగర కమిషనర్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంశలే అందుకున్నారు. మౌర్య సొంతూరు ప్రొద్దుటూరు సమీపంలోని నాగులపల్లె. మౌర్య పుట్టకముందు ఆ ఊరికి నీటి సమస్య ఉండేది. ఊళ్లో నీళ్లట్యాంకు నిర్మిస్తే పరిష్కారం అవుతుందని తెలుసు. ఎన్నో విన్నపాలు చేసుకునేవారు. ఒక కలెక్టర్ చొరవతో చిటికెలో ట్యాంకు మంజూరైంది. ఈ ఉదంతాన్ని ఆ ఊరికి సర్పంచ్‌గా ఉన్న వాళ్ల నాన్న చంద్ర ఓబుళ రెడ్డి మౌర్యకు చెప్పేవారు. కలెక్టర్‌ను దేవుడితో పోల్చేవారు. ఆ తర్వాత ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్రప్రసాద్ గురించి సినిమా కథలా చెప్పుకుంటుంటే వాటి ద్వారా మౌర్య ప్రేరణ పొందారు. బీటెక్ పూర్తిచేసిన తర్వాత గ్రామీణాభివృద్ధిపై పీజీ డిప్లొమా కోర్సు చేసి సివిల్స్‌వైపు దృష్టిపెట్టారు. ఐఏఎస్ అధికారిగా మహిళలకు ఒక భరోసాగా మౌర్య నిలుస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గైడెన్స్, వ్యూహం, సబ్జెక్ట్ ఎంపిక సక్రమంగా ఉంటే సివిల్స్ లక్ష్యం సాధించవచ్చు. ఇవి సరిగ్గాలేక నాలుగేళ్ల పాటు నేను చివరివరకూ వచ్చి చేజార్చుకున్నాను. పెళ్లి చేసేయమని సమాజం నుంచి ఒత్తిడి వచ్చినా తల్లిదండ్రులు నన్ను అర్థం చేసుకున్నారు. అండగా నిలిచారు. లక్ష్యం సాధించాను. ఇప్పుడు నా భర్త సహకారం తోడైంది. అమ్మాయిల ఇష్టాయిష్టాలు తెలుసుకుని కుటుంబం వ్యవహరించాలి

మహిళా దినోత్సవం

శ్రీసిటీలో దేశ, విదేశాలకు చెందిన 235 సంస్థల్లో 65 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుంటే, ఇందులో 34 వేల మంది మహిళలే ఉండడం తిరుపతి జిల్లాలోని ఈ ఆర్థిక మండలి ప్రత్యేకత. ఈ సంస్థల్లో ఏటా రూ. లక్ష కోట్లకు పైగా విలువైన ఉత్పత్తులు తయారవుతుండగా, ఇందులో ఆడవాళ్ల శ్రమ వాటా రూ. 60 వేల కోట్లకు పైగానే కావడం జిల్లాకే గర్వకారణం. శ్రీసిటీ నుంచి ఎగుమతుల విలువే రూ. 57 వేల కోట్లు.



స్త్రీ సిరుల సిటీ
ఆడవాళ్లే అధికం

ఆంధ్రజ్యోతి బ్యూరో, తిరుపతి

శ్రీసిటీలో దేశీయ కంపెనీలతో పాటూ అమెరికా, యూకే, జర్మనీ, చైనా, సింగపూర్, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బెల్జియం తదితర 30 దేశాలకు చెందిన సంస్థలు వున్నాయి. శ్రీసిటీలోని ప్రతి పరిశ్రమలోనూ మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రత్యేకించి కొన్ని సంస్థల్లో అయితే 80 నుంచి 90 శాతం ఉద్యోగులు మహిళలే వుండడం విశేషం. ఉదాహరణకు ఎవర్టెన్ టీ కంపెనీలో 97 శాతం, జెన్ లెనిన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 90 శాతం, ఎమ్మెస్సార్ గార్మెంట్స్‌లో 80 శాతం, హావెల్స్ (లాయిడ్ ఏసీ)లో 60 శాతం, బ్లూస్టార్‌లో 50 శాతం డైకిన్‌లో 40 శాతం మహిళా ఉద్యోగులు వున్నారు. అన్నింటికన్నా విశేషం ఏమిటంటే ఈ పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తున్నవారిలో 90 శాతం మంది జిల్లా వాసులే కావడం. అందులోనూ సత్యవేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ. పారిశుధ్య కార్మికుల నుంచి సెక్యూరిటీ గార్డుల వరకూ... ఆఫీస్ అసిస్టెంట్ నుంచీ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌ల వరకూ... టెక్నికల్ ఆపరేటర్ల నుంచి సూపర్‌వైజర్లు, మేనేజర్లు, మెయింటెనెన్స్ ఇంజనీర్ల వరకూ... చివరికి మెటీరియల్ లోడింగ్ అన్ లోడింగ్ నుంచీ ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ వంటి అరుదైన విధుల దాకా అన్ని విభాగాల్లోనూ మహిళా ఉద్యోగులు మగవారితో పోటీ పడి పనిచేస్తున్నారు. కాల్గేట్ టూత్ బ్రష్‌ల తయారీ మొదలు ఆల్‌స్ట్రామ్ మెట్రో రైళ్ల తయారీ దాకా మహిళల పాత్ర అధికంగా వుంది. మన జిల్లా మహిళల చేతుల మీదుగా జరుగుతున్న ఈ ఉత్పత్తులు దేశీయంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక అభివృద్ధి చెందిన దేశాల ప్రజలకు చేరుతుండడం విశేషం. నిజానికి ఇక్కడ పనిచేస్తున్న స్థానిక మహిళల్లో పెద్దగా చదువుకున్నవారు తక్కువ. నాలుగైదు తరగతులు చదువుకున్న వారికి కూడా శ్రీసిటీలో ఉపాధి లభిస్తోంది. అందుకు అవసరమైన శిక్షణ ఇక్కడ ఇస్తుండడమే కారణం.



ఖయాల్బీ ఇప్పుడు కూలీ కాదు

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన పోలూరు ఖయాల్బీ పదవ తరగతి ఫెయిల్ అయింది. ఎలాంటి ఆస్తి పాస్తులూ లేకపోవడంతో పెళ్ళయ్యాక భర్తతో కలసి కూలి పనులకు వెళ్ళేది. శ్రీసిటీలోని ఎమ్మెస్సార్ గార్మెంట్స్‌లో ఖయాల్బీ పనిచేస్తోంది. ఇపుడామె నెల జీతం రూ. 25 వేలు. గతంలో కూలి పనులకు వెళ్ళిన ఆమె ఇపుడు గర్వంగా తాను శ్రీసిటీ ఉద్యోగినని చెబుతున్నారు.



తల్లిని పోషిస్తున్న గీత

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన రాజేశ్ గీత. ఏడవ తరగతి వరకే చదువుకుంది. భర్త మరణించాడు. పిల్లలు లేరు. తాను బతుకుతూ తల్లిని కూడా పోషించాల్సిన బాధ్యత పైన పడింది. కూలి పనులు చేసే ఆమె, గార్మెంట్స్‌లో చేరి నెలకు రూ. 18 వేలు సంపాదిస్తున్నారు.



తండ్రికి చేదోడుగా కనక

తడ మండలం కారూరు గ్రామానికి చెందిన కనక బి.కాం చదువుతూ మధ్యలో ఆపేసింది. గార్మెంట్స్ పరిశ్రమలో ఏడేళ్ళుగా క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తున్న కనక ఇపుడు నెలకు రూ. 22 వేలు సంపాదిస్తోంది. తల్లిదండ్రులకు చేదోడుగా వుంటూ తమ్ముళ్ళను చదివిస్తోంది.



అరుదైన విధుల్లో ఆడవాళ్లు

శ్రీసిటీలోని జెన్ లెనిన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఫోమ్ వుపయోగించి కుషన్‌తో కూడిన దిండ్లు, దుప్పట్లు వంటివి తయారు చేస్తారు. ఈ పరిశ్రమలో పలువురు మహిళలు అరుదైన విధులు నిర్వర్తిస్తూ కనిపించారు. వారిలో ఒకరు సత్యవేడు మండలం మాదరపాకం గ్రామానికి చెందిన బాబూ పూర్ణిమ. బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతూ మధ్యలో చదువు మానేసిన ఈమెకు భర్త, ముగ్గురు ఆడపిల్లలు వున్నారు. ఏడాదిన్నర కిందట జెన్ లెనిన్ పరిశ్రమలో చేరిన పూర్ణిమ ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా క్రేన్ తరహా వాహనాలు నడుపుతూ మెటీరియల్‌ను తరలించే విధులను అవలీలగా నిర్వర్తిస్తున్నారు.



గట్టున పడ్డ గంగమ్మ

వరదయ్యపాలెం మండలం మోపురుపల్లికి చెందిన గంగమ్మకి భూములూ, ఆస్తులూ లేవు. భర్త హమాలీగా బరువులెత్తే పనులకు వెళితే ఈమె వ్యవసాయ కూలీగా పొలాలకు వెళ్ళేది. ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకున్నా ఇల్లు గడవడం కష్టమయ్యేది. అయితే శ్రీసిటీలోని పరిశ్రమలో చేరడం ఆమె బతుకును మలుపు తిప్పింది. ఐదవ తరగతి వరకే చదువుకున్న గంగమ్మ ఇపుడు నెలకు రూ. 18 వేలు జీతం తీసుకుంటోంది. కొడుకులను ఇంజనీరింగ్, డిగ్రీ చదివించగలుగుతోంది.

కూలీలపైకి దూసుకెళ్లిన మినీ లారీ

- హైవే డివైడర్ వద్ద సుందరీకరణ పనులు చేస్తున్న ఇద్దరి దుర్మరణం
- ముగ్గురికి తీవ్ర గాయాలు



లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన తిరుపాల్‌ను పట్టుకొని రోదిస్తున్న మహిళ







రమణమ్మ తిరుపాలు (ఫైల్ ఫొటోలు)

లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన రమణమ్మ

రేణిగుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసు స్టేషన్ సమీపంలోని హైవే వంతెనపై శుక్రవారం మధ్యాహ్నం ఓ గూడ్స్ మినీ లారీ అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొని.. అటువైపు రోడ్డులోకి దిగి గ్రీనరీ పనులు చేస్తున్న కూలీలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన ఎనిమిది మంది కూలీలు ఇక్కడి పోలీస్ స్టేషన్ సమీపంలోని హైవే వంతెనపై ఉన్న డివైడర్లకు గ్రీనరీ పనులు చేస్తున్నారు. విమానాశ్రయం సమీపంలోని ఓ కంపెనీకి పాండిచ్చేరి నుంచి మిషన్ విడిభాగాలను తీసుకొస్తున్న మినీ గూడ్స్ లారీ వంతెనపై అతివేగంగా రావడంతో అదుపుతప్పింది. రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొడుతూ ఆ పక్క రోడ్డులోకి దూసుకుపోయింది. అక్కడ గ్రీనరీ పనులు చేస్తున్న కూలీలను ఢీకొని.. వంద మీటర్లు లాక్కొని పోవడంతో రమణమ్మ (53) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన తిరుపాల్, సక్కమ్మ, శైలజ, సరోజమ్మను చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తిరుపాల్ (63) మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవరు సంఘటన స్థలం నుంచి పరారయ్యాడని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

భీమవరంలో విషాదం

పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి: గాజులమండ్యం పోలీసు స్టేషన్ సమీపంలో జరిగిన ఘటనలో ఇద్దరు కూలీలు మృతి చెందడంతో పెళ్లకూరు మండలం నెలబల్లి పంచాయతీ భీమవరం దళితవాడలో విషాదం చోటుచేసుకుంది. గ్రామంలో రబీలో వ్యవసాయ పనులు ముగియడంతో జాతీయ రహదారి డివైడర్ మధ్యలో మొక్కలు నాటే సుందరీకరణ పనులకు కొంతకాలంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో కట్ల రమణమ్మ, దామతోటి తిరుపాల్ మృతి చెందారు. వీరంతా నిరుపేద కుటుంబీకులే. రమణమ్మ భర్త రెండేళ్ల కిందట మృతిచెందాడు. దీంతో కూలీ పనులకు వెళ్లి తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారామె. కూలికి వెళ్తేనే వీళ్లకు పూట గడిచేది. ఇక, సూళ్లూరుపేట మండలం వెలగల పొన్నూరుకు చెందిన తిరుపాల్, ఐదేళ్ల కిందట తన భార్య నాగరాజమ్మ స్వగ్రామమైన భీమవరం వచ్చారు. భార్యతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి మృతితో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

అత్తను చంపిన అల్లుడు

- నగదు, నగల కోసం కిరాతకం
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు



హత్యకు గురైన ప్రమీలమ్మ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగదు, నగల కోసం అత్తను హతమార్చాడు. ఈ ఘటన తిరుపతి నగరం కొలవీధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వెస్ట్ పోలీసుల కథనం మేరకు.. ఎర్రావారిపాలెం మండలం బండమీద కమ్మపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి, ప్రమీలమ్మ దంపతులు 30 ఏళ్ల కిందట జీవనోపాధి కోసం తిరుపతికి వలస వచ్చారు. కొలవీధిలోని చిన్నగుంట మోక్షిత నిలయంలో కాపురమున్నారు. ఇప్పుడు ప్రమీలమ్మ(53) స్థానికంగా పాచి పనులు చేసుకుంటుండగా.. గోపాల్‌రెడ్డి మేస్త్రీ పనిచేస్తూ పీపీ చావడి వీధిలోని ఇంట్లో ఉంటున్నాడు. అతడి భార్య ప్రమీలమ్మ చిన్న కుమార్తె రోజా వద్ద ఉంటోంది. రోజాకు తిరుపతికి చెందిన రవినాయక్‌కు ఇచ్చి రెండో వివాహం చేశారు. తిరుమలలో సుమో డ్రైవర్‌గా పనిచేస్తున్న రవినాయక్ తాగుడుకు అలవాటు పడ్డాడు. విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టేవాడు. తన ఖర్చుల కోసం అత్త ప్రమీలమ్మ వద్ద ఉన్న డబ్బులు, నగలు ఇవ్వాలని శుక్రవారం డిమాండ్ చేశాడు. ఆమె నిరాకరించడంతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దీనిపై రెచ్చిపోయిన రవినాయక్ ఆమె తలను పట్టుకుని ఇంట్లోని గోడకు బలంగా నాలుగైదు సార్లు మోదాడు. తలపై తీవ్రగాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రోజా ఫిర్యాదు మేరకు సీఐ మురళీ మోహన్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. నిందితుడికోసం ఎస్‌ఐ, తన సిబ్బందితో కలిసి తిరుమల, తిరుపతిలో గాలిస్తున్నారు.

నేడు జిల్లా జూడో జట్టు ఎంపిక

తిరుపతి(క్రీడలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో శనివారం జిలాస్థాయి జూడో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జూడో సంఘం జిల్లా కార్యదర్శి జగదీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2005నుంచి 2010 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి ఉంటుందని, ఎంపికైన క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9059506346ను సంప్రదించాలని కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా మండలాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బోరుబావులు, చేతిపంపులు, గ్రామీణ నీటి సరఫరా పథకాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. అవసరమైతే ట్యాంకుల ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 29,101 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు 29,101 మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పేపర్ -2ఏ, బోటనీ పేపర్ -2, సివిక్స్ పేపర్ -2 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 29,698 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 597 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్‌ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

రాజీ పేరుతో చితకబాదారు

- ఎక్సైజ్ సీఐపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

కోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గొడవ విషయంలో రాజీపోవాలని తనను చావబాదారంటూ వాకాడు ఎక్సైజ్ సీఐపై కల్లుగీత కార్మికుడు ఉప్పల వెంకటేశులుగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోట మండలం వెంకటపాళెం పంచాయతీ పరిధిలోని వీరారెడ్డిసత్రం గ్రామానికి చెందిన వెంకటేశులుగౌడ్.. తిన్నెలపూడి సమీపంలోని పొలాల్లో గల తాటిచెట్లకు కల్లు గీసుకుని జీవనం సాగిస్తున్నారు. రెండు వారాల కిందట కల్లు విక్రయాలు జరిపే విషయమై ఇతడికి మరో కార్మికుడు రాగయ్య మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో వీరిమధ్య రాజీ చేసేందుకు వచ్చిన ఎక్సైజ్ పోలీసులు తనను తీసుకెళ్లి చితకబాదారని వాకాడు ఎక్సైజ్ సీఐపై కోట పోలీసులకు వెంకటేశులు గౌడ్ ఫిర్యాదు చేశారు.

భూ పరిహారంలో బినామీలు?

- రూ.కోట్లు కొట్టేసేందుకు పక్కా స్కెచ్

సత్యవేడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి చేపడుతున్న భూసేకరణలో ప్రభుత్వ భూములకు సంబంధించి పరిహారం కోసం బినామీ రైతుల పేర్లతో కొందరు దళారులు పక్కా స్కెచ్ వేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వీరి వ్యవహారశైలి దీనికి బలం చేకూరుస్తోంది. గతేడాది అక్టోబరులో ఏపీఐఐసీ ద్వారా రెండు వేల ఎకరాల భూసేకరణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం గ్రామాలలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ, పట్టా భూములను గుర్తించి ఏపీఐఐసీకి నివేదిక అందించారు. సత్యవేడు మండలం ఇరుగుళంలో 73 ఎకరాలు, కొల్లడంలో 69, పెద్దఈటిపాకంలో 53 ఎకరాల పట్టా భూములకు నోటిఫికేషన్‌నూ విడుదల చేశారు. మరోవైపు సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో మూడు రోజులుగా అవార్డెడ్ ఎంక్వైయిరీ (రికార్డుల పరిశీలన) ప్రారంభమైంది. కొల్లడం, పెద్దఈటిపాకం, చిన్నఈటిపాకం గ్రామాలలో ప్రత్యేక రెవెన్యూ అధికారులు భూసేకరణ కోసం ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని రైతుల రికార్డులను పరిశీలించారు. భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలతో పాటు, రైతు అనుభవంలో ఉన్న భూ విస్తీర్ణం, అనువంశికం, వన్ బీ, అడంగల్ తదితర రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. శ్రీసిటీ గ్రామాలకు చెందిన కొందరు.. ప్రభుత్వ భూముల పరిహారం జాబితాలో బినామీ పేర్లను చేర్చి అడ్డదారిలో లబ్ధిపొందేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇరుగుళం పంచాయతీ సర్వే నెంబర్ 162/1లో 3.82 ఎకరాలకు సంబంధించిన ప్రభుత్వ భూమిలో పరిహారం కోసం రైతులుగా ముగ్గురి పేర్లను జాబితాలో చేర్చారు. చిన్నఈటిపాకం పంచాయతీ సర్వే నెంబర్ 3బీ/1లో 3.88 ఎకరాలకు సంబంధించి మరో నలుగురి పేర్లను నోటిఫికేషన్‌లో చేర్చినట్లు సమాచారం. పరిహారం జాబితాలో ఇద్దరు మాజీ వలంటీర్ల పేర్లు ఉన్నట్లు ఆయా గ్రామాల్లో రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పర్యటిస్తున్న రెవెన్యూ అధికారులకు ఈ దళారులు సకల సదుపాయాలు సమకూరుస్తూ హల్‌చల్ చేయడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. భూ పరిహారం జాబితాలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, అంత వరకు ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లించవద్దని కోరుతూ ఆర్డీవో కిరణ్మయికి సీపీఎం నాయకులు దాసరి జనార్దన్, రమేష్ వినతిపత్రం సమర్పించారు.



భూ సేకరణ గ్రామాల్లో రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ బృందం





ఎస్ఎస్ కెనాల్ పూర్తి చేయండి

సోమశిల-స్వర్ణముఖి కాలువ పనులు పూర్తయితే శ్రీకాళహస్తి నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది. అలాంటి కాలువను గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. రూపాయి కూడా విడుదల చేయకుండా రైతులకు అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ కెనాల్‌ను పూర్తి చేయాలి. శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్ట, ఎన్టీఆర్‌నగర్, కైలాసగిరి ప్రాంతంలో సుమారు 40 ఏళ్ల నుంచి పదివేల కుటుంబాలకుపైగా ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నాయి. వారందరికీ ఎంజాయ్‌మెంట్ పట్టా మంజూరు చేస్తే ప్రయోజనం చేకూరుతుంది. ఇక, తిరుపతి రూరల్ మండలం ఓటేరు వద్ద రూ.900 కోట్ల విలువైన భూములను కబ్జా చేసేందుకు కొందరు వైసీపీనాయకులు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఓ నేతను ముందుపెట్టి వెనక నుంచి కొందరు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు. గతంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు చొరవతో ఈ భూమి ఇప్పటికీ అన్యాక్రాంతం కాకుండా ఉంది. ఇప్పుడు ఆక్రమణలకు గురికాకుండా సంబంధిత మంత్రి చర్యలు తీసుకోవాలి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పనులు సకాలంలో పూర్తి కావాలంటే టైం లిమిట్ పెట్టాలి. జగనన్న కాలనీలకు భూములిచ్చిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు వేయగా, వెంటనే వేరే వారి ఖాతాలకు ఆ నగదు వెళ్లింది. దీనిపై విచారణ జరిపించాలి.

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె

అలిపిరి పాదాల వద్ద మోకాళ్లపై నిల్చుని వేడుకోలు

తిరుపతిరూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యా ర్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్ర వారమూ కొనసాగింది. అలిపిరి పాదాల వద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి.. మోకాళ్లపై నిల్చుని తమ సమస్యను త్వరగా పరిష్కరించేలా పాలకులకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ దండాలు పెట్టి వేడుకున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే తమకు న్యాయం జరుగుతుందని నమ్మకం పెట్టుకున్నామని, అయితే పాలకులు తమగోడు ఆలకించడం లేదని వాపోయారు. వైద్య విద్యార్థుల తరహాలో తమకూ సమానత్వం, గౌరవం, న్యాయం లభించేవరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం వర్సిటీ ప్రధానగేటు ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో బైఠాయించి ప్లకార్డులను చేతబట్టి నిరసన కొనసాగించారు.



మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జ్యోత్స్న తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మార్చి పది నుంచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దేవప్రసాదరాజుకు అమెరికా ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజుకు అమెరికా బోస్టన్‌లోని యునైటెడ్ సైంటిఫిక్ గ్రూప్ నుంచి ఆహ్వానం అందింది. నవంబరు 3వ తేదీ నుంచి చేపట్టే అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించాలని ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కెన్నెత్ బ్లమ్ ఆహ్వానం పంపారు. డెవలప్‌మెంట్ ఆఫ్ ఎర్బియం డోప్డ్ గ్లాస్ మెటీరియల్స్ ఫర్ సి-బాండ్ టెలీ కమ్యూనికేషన్స్ అంశంపై ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ప్రసంగించనున్నారు.

పొదుపు.. గెలుపు!

● గోనుగూరు మహిళల విజయగాథ

మహిళలు అనుకుంటే సాధించలేనిది లేదు. నేలనుంచి ఆకాశం దాకా వారు అందుకోని లక్ష్యం లేదు. పొదుపుతో గెలుపునందుకున్న మహిళలు వీరు. నివసిస్తున్న గోనుగూరు గ్రామాన్ని సంపద్వంతం చేస్తున్నారు.



గోనుగూరు - మహిళా సంఘాల సమావేశం





కుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని ప్రధాన రహదారికి ఒక మూలగా ఉండే గోనుగూరు ఒకప్పుడు వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగించేది. మహిళలు కూడా మగవాళ్లకు చేదోడువాదోడుగా లేదా వ్యవసాయ కూలీలై రైతు యజమానులకు వ్యవసాయ పనుల్లో సాయపడుతూ ఉండేవారు.చంద్రబాబు కుప్పం నుంచి పోటీ చేసి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించాక గోనుగూరు జీవన దృశ్యం మారుతూ వచ్చింది.వెలుగు ప్రాజెక్టుతో గోనుగూరు మహిళల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు పూస్తున్నాయి. గోనుగూరు గ్రామ సమాఖ్యలో ఇప్పుడు 21 మహిళా సంఘాలు, 229మంది సభ్యులు ఉన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.123.53 లక్షల రుణాలను ప్రభుత్వం ఈ సంఘాలకు ఇచ్చింది. స్త్రీ నిధి రుణాలు మరో రూ.45.50 లక్షలు పంపిణీ అయ్యాయి. ఇలా ప్రభుత్వం విస్తృతంగా పంపిణీ చేసిన తక్కువ వడ్డీ రుణాలతో మహిళలు వివిధ రంగాల్లో స్వయం ఉపాధిని సాధించారు.స్వల్ప పెట్టుబడులతో అధికాదాయ మార్గాల్లో స్వావలంబన దిశగా గోనుగూరు మహిళా లోకం పయనిస్తోంది.

● ఆకలిగొన్నవాళ్ల కడుపు నింపుతూ



విజయభారతి మహిళా పొదుపు సంఘం సభ్యురాలు పొన్నమ్మ కుప్పం పట్టణం మసీదు ప్రాంతంలో చిన్నపాటి హోటల్ నడుపుతున్నారు. రూ.3 లక్షలు రుణంగా తీసుకుని ఈ హోటల్ పెట్టారు. రోజుకు సుమారు రూ.6 వేలదాకా వ్యాపారం నడుస్తోంది. అన్ని ఖర్చులు పోనూ కనీసం రూ.1500 నుంచి రూ.2500 దాకా మిగులుతుందని పొన్నమ్మ అంటారు. అంతేకాదు, హోటల్ ద్వారా మరో ముగ్గురికి ఈమె ఉపాధి చూపుతున్నారు. ఆకలిగొన్నవారికి కడుపునిండా ఇంటి భోజనం పెట్టి, అందులోనే ఆదాయాన్ని చూడగలగడం ఆనందంగా వుందంటారు పొన్నమ్మ.

● పాడితో పరువుగా



మహిళా సమాఖ్య ద్వారా తీసుకున్న రూ.2 లక్షల రుణంతో మూడు ఆవులు పట్టుకున్నారు లక్ష్మి. తనకున్న 40 సెంట్ల పొలంలో 1300 రోజా మొక్కలు నాటారు. ఆవులకు ఫీడ్‌కోసం చాప్ కట్టర్ కూడా కొనుగోలు చేశారు . మూడు పాడి ఆవుల నుంచి రోజుకు వస్తున్న 30 నుంచి 40 లీటర్ల పాలను డెయిరీలకు పోస్తున్నారు. మరోవైపు రోజా పూలను మార్కెట్టుకు తరలిస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. రుణం తీసుకుని పాడి ఆవులు పట్టుకున్న తర్వాత తన కుటుంబం గాడిన పడిందని, ఇంటి ఖర్చులతోపాటు అదనపు ఖర్చులు కూడా గడిచిపోతున్నాయని లక్ష్మి ఆనందంగా అంటారు.

● కిరాణా దుకాణంతో గట్టున పడి

గోనుగూరులోనే చిన్న కిరాణా దుకాణం నడుపుతున్నారు కోకిల. గతంలో మహిళా సమాఖ్యనుంచి తీసుకున్న రూ.2 లక్షల రుణంతో ఈ దుకాణం పెట్టడానికి సాహసించారు. చూడ్డానికి చిన్నపాటి కిరాణా దుకాణమే కానీ, ఇందులో లేని సరుకులు లేవు. దుకాణాన్ని మరింతగా విస్తరించడానికి ఈమధ్యనే మరో రూ.50 వేల రుణంకోసం దరఖాస్తు చేసుకున్నారు. మహిళా సమాఖ్య ద్వారా తీసుకున్న రుణం తన కష్టాలను గట్టెక్కిచ్చిందని సంతృప్తి నిండిన ముఖంతో చెప్పారు కోకిల.



● ఆవులతో ఆరామ్‌గా

గోనుగూరుకే చెందిన ఈశ్వరమ్మ లక్ష రూపాయల రుణం తీసుకుని రెండు ఆవులను పట్టుకున్నారు. రోజుకు కనీసం 18 నుంచి 20 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిని డెయిరీలకు పోసి వచ్చే ఆదాయంతో ఇంటిని నడిపిస్తున్నారు. భర్తకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఆవులు పట్టుకున్నప్పటినుంచీ కుటుంబానికి కాస్త వెసలుబాటు లభించిందని, రేపు ఏమవుతుందోనన్న భయం లేకుండా స్థిమితంగా ఉండగలుగుతున్నానని అంటారు ఈశ్వరమ్మ.



● బొప్పాయి తోటతో బాగుపడి



గాయత్రి రూ.3 లక్షలు రుణం తీసుకుని దానికి కొంత నగదు కలిపి సుమారు రెండు ఎకరాల్లో బొప్పాయి తోట వేశారు. ఈ తోట మధ్యలో అంతర పంటగా డ్రై ఫ్రూట్స్ మొక్కలు కూడా పెట్టారు. ఇప్పుడీ రెండు పంటలూ పక్వానికి వచ్చి ఫలితాన్నిస్తున్నాయి. నిర్వహణ కొంచెం కష్టమైనా తీసుకున్న రుణంతో పెట్టిన బొప్పాయి, డ్రై ఫ్రూట్స్ పంటలతో ఓ మోస్తరు లాభాలు వస్తున్నాయని చెప్పారు గాయత్రి. కుటుంబానికి ఈ రూపంలో ఆదాయం సమకూరి బతుకులు బాగుపడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారామె.

కేంద్ర నిధులతో అభివృద్ధి పరుగులు

దగ్గుబాటి పురందేశ్వరి



బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి

చిత్తూరు సెంట్రల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధులతో చిత్తూరు జిల్లాలో అభివృద్ధి పరుగులు తీస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. శుక్రవారం చిత్తూరులో జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నార్త్ సౌత్ కారిడార్లో భాగంగా బెంగళూరు-చెన్నై నగరాల మధ్య చిత్తూరు జిల్లా పరిధిలో రూ.920 కోట్ల వ్యయంతో 85 కిలో మీటర్ల నాలుగు లేన్ల రహదారులు నిర్మించినట్లు తెలిపారు. చిత్తూరు నుంచి తచ్చూరు వరకు చెన్నై పోర్టు కనెక్టివిటీ కోసం రూ.3840 కోట్ల వ్యయంతో 116 కిలో మీటర్ల ఆరు లేన్ల రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. బెంగళూరు-చెన్నై మధ్య రూ.17,930 కోట్ల వ్యయంతో 260 కిలో మీటర్ల ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే చిత్తూరు జిల్లాను కలుపుతూ చేపడుతున్నారని చెప్పారు. చిత్తూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.11 కోట్లు, అమృత్ కింద చిత్తూరు నగర అభివృద్ధికి రూ.250 కోట్లు కేంద్రం మంజూరు చేసిందన్నారు.అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం చేసేలా కోట్ల రూపాయలు నిధులు కేటాయించిన విషయాన్ని బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు.తర్వాత పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్‌పీ వెంకటేశ్వరచౌదరి,మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, చిలకం ఈశ్వర ప్రసాద్, రామచంద్రుడు, జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు నిషిధరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రమేష్‌నాయుడు, తులసీనాథ్, రెడ్డిప్రసాద్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ లీగ్

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు



చిత్తూరు క్రీడలు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మనదేశంలో త్వరలోనే ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ లీగ్ పోటీలు జరగనున్నట్లు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి, ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు తెలిపారు. శుక్రవారం చిత్తూరులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఇంటర్నేషనల్ లీగ్‌పై ఇప్పటికే ఎంవోయూ కుదుర్చుకున్నామని వివరించారు. త్వరలో అసోం రాష్ట్రంలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయని చెప్పారు. దీనికోసం ఇటీవల విజయవాడలో అండర్-23 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆటగాళ్లను ఎంపిక చేసి.. చిత్తూరులో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఏప్రిల్‌లో చిత్తూరు సమీపంలోని పీఈఎస్ పాఠశాలలో అంతర జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ ఉంటుందన్నారు.

రాణీసదాశివమూర్తికి ఠాగూర్ పురస్కారం



పురస్కారాన్ని స్వీకరిస్తున్న రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ పురస్కారాన్ని పొందారు. వేద సాహిత్య, ధర్మ ప్రచారానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. తెలంగాణ గవర్నర్ దేవవర్మ చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరించారు. కోల్‌కత్తాలోని విశ్వ జ్యోతిష్య విద్యాపీఠంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ హెరిటేజ్ సంస్థ నిర్వహించిన 46వ వార్షిక అంతర్జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

నేటినుంచి సంస్కృత వర్సిటీలో జానపద విజ్ఞాన సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శనివారం నుంచి జానపద విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. దక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ, సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్తంగా మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించనున్నాయి. భారతీయ పురాణాలు - భారతీయ జానపద, గిరిజన విజ్ఞానం - తులనాత్మక పరిశీలన అంశంపై సదస్సు నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధులు పత్ర సమర్పణలు చేస్తారని జాతీయ సంస్కృత వర్సిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ డి.నల్లన్న తెలిపారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీజీ సెట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎస్వీయూలోని పీజీసెట్ కార్యాలయం ముందు విద్యార్థి సంఘాలు శుక్రవారం ధర్నా నిర్వహించాయి. పీజీ అడ్మిషన్ల నిర్వహణ బాధ్యతను యూనివర్సిటీలకే అప్పగించాలని కోరుతూ కొంతకాలంగా ఆందోళన సాగుతున్న విషయం తెలిసిందే. ఏఐఎస్ఎఫ్ నేతలు బండి చలపతి, ఉదయ్, ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ నేత వినోద్, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్, లా స్టూడెంట్ యూనియన్ నేత సుందర్రాజు, ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ నేత పాల్యా శివశంకరనాయక్, ఏఐఎస్ఏ నేత చిన్నా, జేబీఎస్ఎఫ్ నేత భార్గవ తదితరులు మాట్లాడారు. పీజీ అడ్మిషన్ల బాధ్యత యూనివర్సిటీలకే అప్పగించకపోతే అడ్మిషన్లు తగ్గిపోతున్నాయన్నారు. తద్వారా యూనివర్సిటీలు మూతపడే అవకాశం ఉందన్నారు. పీజీసెట్ కన్వీనర్ రాజీనామా చేయాలని కోరారు. పీజీసెట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్ చించివేశారు. విషయాన్ని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ దృష్టికి తీసుకెళతానని పీజీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు హామీ ఇచ్చారు.

నోయిడాలో మెరిసిన ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలు

సాంస్కృతిక పోటీల్లో విద్యార్థుల అత్యద్భుత ప్రదర్శన





జ్ఞాపికను స్వీకరిస్తున్న ఎస్వీయూ కళా బృందం - జ్ఞాపిక స్వీకరిస్తున్న పద్మావతి వర్సిటీ కళా బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సమీపంలోని నోయిడాలో నిర్వహించిన అఖిల భారత యూనివర్సిటీల సాంస్కృతిక సమ్మేళనంలో తిరుపతికి చెందిన ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీ విద్యార్థులు అత్యద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఎస్వీయూకు చెందిన తేజకు క్లే మోడలింగ్‌లో మొదటి స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో దేవ, మౌనికకు ద్వితీయ స్థానం, మెహందీలో సంధ్య, దీప్తికి ద్వితీయ స్థానం, రంగోళీలో వీరాంజనేయులు ద్వితీయ స్థానం, పోస్టర్ మేకింగ్‌లో దేవ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇలా లలిత కళల్లో ఎస్వీయూకు ఓవరాల్ చాంప్ రెండవ స్థానం లభించింది. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు అభినందించారు. పద్మావతి యూనివర్సిటీకి చెందిన ప్రణూష, ప్రత్యూష, మౌనిక, భాను, చంద్రజ్యోతి, మీనా, భాను, శివని, కీర్తి మైమ్‌లో మొదటి స్థానంలో నిలిచారు. స్కిట్‌లో నీలిమ, సత్య భార్గవి, సువర్ణేశ్వరి, సాత్విక, నిహారిక ద్వితీయ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీలో ప్రగతి జైస్వాల్ ఐదవ స్థానంలో నిలిచారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో మూడవ స్థానంలో నిలిచారు. వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.40 కోట్లు

ఐరాల(కాణిపాకం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,40,88,806 లభించింది. ఆస్థాన మండపంలో శుక్రవారం ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో స్వామి కానుకలను లెక్కించారు. ఈ ఆదాయంలో 115 గ్రాముల బంగారు, 2 కిలోల 510 గ్రాముల వెండితో పాటు 506 యూఎస్‌ఏ, 100 ఆస్ట్రేలియా, 100 కెనడా డాలర్లు, 35 యూఏఈ దిర్హామ్స్, 15 ఇంగ్లాండ్ పౌండ్లు, 34 మలేసియా రింగిట్స్ లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.10,041, అన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.46,285 సమకూరాయి. వరసిద్ధుడి ఆలయానికి ఈ ఆదాయం 24 రోజుల్లో దక్కింది. ఈ లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ప్రసాద్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఆలయ, యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



ఈవోకు చెక్ అందజేస్తున్న మురళీకృష్ణ

వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు రూ.5,01,000లను శుక్రవారం బెంగళూరుకు చెందిన మురళీ కృష్ణ, మహేశ్వరి విరాళంగా అందించారు. దాతలను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఆడవారికి అండగా కూటమి ప్రభుత్వం



రామకుప్పంలో ఈ-సైకిళ్లు పంపిణీ చేస్తున్న నేతలు

రామకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంఘ సభ్యులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని రామకుప్పం టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు అన్నారు. శుక్రవారం రామకుప్పం స్త్రీశక్తి భవనంలో మండలంలోని 50 మంది మహిళా సంఘాల సభ్యులకు ఈ-సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, వెలుగు ఏపీఎం శ్రీనివాసమూర్తి, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు పద్మమ్మ, కూటమి నేతలు రామ్మూర్తి, సీతాపతి, గంట్లప్పగౌడు, మనోహర్, జయశంకర్, మహ్మద్‌రఫీ, గజేంద్ర, కామరాజనాయక్, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణం, జేయి, బాలరాజు, సుబ్రీ, నవీన్, సురేష్ భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కోచ్ యూసఫ్‌బాషాకు సన్మానం



యూసఫ్ బాషాను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మొహమ్మద్ తదితరులు

పలమనేరు, మార్చి7(ఆంధ్రజ్యోతి) : పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కోచ్ యూసఫ్‌బాషాను శుక్రవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. మదపల్లికి చెందిన యూసఫ్‌బాషా సీనియర్ షూటింగ్ బాల్ క్రీడాకారుడు. నేపాల్‌లో గత ఫిబ్రవరి 1 నుంచి మూడో తేది వరకు జరిగిన 2వ ఏషియన్ షూటింగ్ బాల్ పోటీల్లో భారత జట్టులో ఆయన పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాకిస్తాన్ జట్టుతో పోటీపడి విజయం సాధించారు. శుక్రవారం పలమనేరుకు వచ్చిన యూసఫ్‌బాషాను ప్రిన్సిపాల్ మొహమ్మద్, అధ్యాపకులు, వ్యాయామ అధ్యాపక అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరారెడ్డి, బి.గోవర్ధనరెడ్డి, బి.మహేష్, ఎస్. హరికుమార్, పీడీ అసోసియేషన్ పలమనేరు జోన్ అధ్యక్షులు టి.ఎస్.రమణ, సురేష్, అజయ్, సూర్యప్రకాష్, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

సంతలో ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



చిరువ్యాపారుల నుంచి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పలమనేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శుక్రవారం జరిగే సంతలో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది వ్యాపారులు వినియోగిస్తున్న నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. గంగమ్మ గుడి వీధిలోని దుకాణాలను సైతం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

కల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సమన్వయకర్త షణ్ముగం తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయులు వెంకటశిద్దులు, రాజశేఖర్, సచివాలయ సిబ్బంది రేణుక, భరత్, ప్రకాష్, నిరోషా, శకుంతల, రోహిణి, సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలతో పశువుల ఆరోగ్యం

రొంపిచెర్ల మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాడిపశువులకు గాలికుంటు టీకాలు తప్పని సరిగా వేయించాలని, దీంతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయని రొంపిచెర్ల పశువైద్యాధికారి డాక్టరు శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గానుగచింతలో పశువైద్యశిబిరం నిర్వహించారు. 320 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఎల్ఎస్ఏ అరుణ, అల్తాఫ్, రాజశేఖర్, నవ్యశ్రీ, తేజకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్

గుడుపల్లె మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని.. ఇందుకు ఉన్నత విద్యను అభ్యసించాలని ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ద్రావిడ వర్సిటీ కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మహిళలు శక్తి వంతులు, జ్ఞానవంతులని కొనియాడారు. రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేటి మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య శ్యామల, మహిళా సెల్ కోఆర్డినేటర్ మెర్సిరత్న రాణి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

● పుంగనూరు రూరల్: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే సంప్రదాయాలను అలవర్చుకోవాల్సిన అవసరముందని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కాలేజీ ఆవరణలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు షాహిదాబాను, పవిత్ర, నిర్మల, స్రవంతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా లెప్రసీ నివారణాధికారి వెంకటప్రసాద్

కల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎంపికైన మతుకువారిపల్లి, పోశంవారిపల్లి, నన్నూరివారిపల్లి హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మతుకువారిపల్లి, పోశంవారిపల్లి, నన్నూరివారిపల్లి పంచాయతీల్లో 2023 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు టీబీ కేసులు నమోదు కాలేదన్నారు. వైద్యాధికారులు జానకీరావు, యల్లయ్య, షమామరెహ్మాన్, సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, మూర్తి, శారద, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కడా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

కుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్స వేడుకలు నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు జరిగే ఈ వేడుకల్లో కుప్పం నియోజకవర్గం నుంచి మిస్ యూనివర్స్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి అర్హత సాధించిన చందన జయరాం పాల్గొంటారని చెప్పారు. వివిధ రంగాలలో సేవలు అందించిన మహిళలకు సన్మానంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మహిళలు పెద్దయెత్తున మహిళా దినోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

హనుమంత వాహనంపై శ్రీవారి దివ్యతేజం



సోమల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా గ్రామోత్సవం నిర్వహించారు. హనుమంత వాహనంపై స్వామివారిని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాంపల్లె, వంగసానివారిపల్లె, కలమందలవారిపల్లె గ్రామస్థులు, బసిరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. టీటీడీ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యసంరక్షణపై అవగాహన



బైరెడ్డిపల్లె, మార్చి 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తీర్థం పీహెచ్‌సీ వైద్యులు పద్మావతి ఆరోగ్యసంరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో కలిగే సమస్యలు, పౌష్టికాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు చదువే విలువైన ఆభరణం

● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ● మహిళా ఉపాధ్యాయులకు సన్మానం





రామకుప్పంలో మహిళలను సత్కరించిన నాయకులు, బైరెడ్డిపల్లెలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో నిర్వాహకులు

రామకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉన్నత విద్యను అభ్యసించడమే వారికి విలువైన ఆభరణమని.. టీడీపీ ఆవిర్భావంతోనే రాష్ట్రంలో మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు మెరుగుపడ్డాయని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి అన్నారు. శుక్రవారం రామకుప్పంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పార్టీ మహిళా నేతలు, మహిళా సంఘమిత్రలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ సీఎంగా మహిళలకు ఆస్థి హక్కు, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి వారిలో చైతన్యం తీసుకొచ్చారన్నారు. అదేబాటలో సీఎం చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశారన్నారు. అనాదిగా వంటింటికే పరిమితమైన మహిళలు టీడీపీ ఆవిర్భావంతో పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణించడం ప్రారంభమైందన్నారు. మహిళలు ఏ రంగంలోనైనా ఉన్నతస్థితికి చేరుకున్నప్పటికీ కుటుంబ బాంధవ్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ప్రతి కుటుంబంలో అత్తాకోడళ్లు అన్యోన్యంగా ఉంటే ఆ కుటుంబాలు ఆనందమయంగా ఉంటాయన్నారు. బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు పద్మమ్మ, టీడీపీ నేతలు రామ్మూర్తి, సీతాపతి, గంట్లప్పగౌడు, మనోహర్, జయశంకర్, మహ్మద్‌రఫీ, గజేంద్ర, కామరాజనాయక్, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణం, జేయి, బాలరాజు, సుబ్రీ, నవీన్, సురేష్ జనసేన నేతలు భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వి.కోట యండీహెచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యండీహెచ్ ఫౌండేషన్ ఛైర్మన్ పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ సృష్టికి మూలకర్త అయిన స్త్రీలను ప్రతిఒక్కరూ గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా సీఆర్సీ పరిధిలో ఉన్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాశాల విద్య భవిష్యత్తుకు పునాది



● పలమనేరు: కళాశాల విద్య భవిష్యత్తుకు పునాది అని.. విద్యార్థి దశలో ఆకర్షణలకు లోనైతే జీవితం అంధకారమవుతుందని పలమనేరు ఎస్ఐ స్వర్ణతేజ సూచించారు. శుక్రవారం పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని.. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వాస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శారద మాట్లాడుతూ సమాజానికి మహిళా శక్తి ఆవశ్యకతను వివరించడంతో పాటు ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మహిళా సాధికారిక విభాగం సమన్వయకర్త డాక్టర్ శశికళ మాట్లాడుతూ మహిళలు తన శక్తిని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని.. సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్ర ధారణ, విచిత్ర వేషధారణ, జానపద నృత్యాలతో అలరించారు. ఐ.క్యూ.ఎ.సి కోఆర్డినేటర్ డాక్టర్ బేనజీర్, మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు

● రూ.48 లక్షలతో ముస్తాబైన గాలిగోపురం, ముఖద్వారం నిర్మాణ పనులు



కల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు దేవళంపేటలో భక్తుల పాలిట కొంగు బంగారంగా కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాలకు దేవాదాయశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రూ.48 లక్షలలో ఆలయ ముఖద్వారం, గాలిగోపురం నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. 500 ఏళ్ల చరిత్ర కలిగిన అతి పురాతనమైన ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఏడేళ్ల అనంతరం జరగనున్న దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకోనున్నారు. ఆలయ గాలిగోపురం, ముఖద్వారం నిర్మాణం తర్వాత జరుగుతున్న తొలి సారి బ్రహ్మోత్సవాలు కావడంతో ఆలయ ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. పులిచెర్ల-కల్లూరు ప్రధాన రహదారి నుంచి భక్తులకు స్వాగతం పలికేందుకు ప్రత్యేక తోరణాలు ఏర్పాటు చేశారు. ఆలయ మాడ వీధులు, గాలిగోపురం, ముఖద్వారం నుంచి కల్లూరమ్మ ఆలయం వరకు విద్యుత్ దీపాకలంరణ చేశారు. ఈ ఉత్సవాలకు రోజూ వేలసంఖ్యలో తరలిరానున్న భక్తులకు తాగునీరు, విద్యుత్ సమస్య తలెత్తకుండా దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాల్లో భక్తులకు మజ్జిగ, అన్నదాన కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని కమిటీ తెలిపింది. ఉత్సవాల్లో టీటీడీ వారిచే అన్నమయ్య సంకీర్తనలు, కోలాటాలు, భజన గీతాలు కొనసాగనున్నాయి. 8న శనివారం కలశ ప్రతిష్ఠతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 9న ధ్వజారోహణం, అదే రోజు చంద్రప్రభ వాహనం, 10న హనుమంత వాహనం, 11న సింహ వాహనం, 12న శేష వాహనం, 13న గరుడ వాహనం, 14న సూర్యప్రభ వాహనం, స్వామివారి కల్యాణోత్సవం, 15న రథోత్సవం, 16న అశ్వ వాహనం, పార్వేట ఉత్సవం, 17న చక్రస్నానం, హంస వాహనం, ధ్వజావరోహణం, 18న ఊంజల్‌సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి. లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవ వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఉత్సవాల నిర్వాహకులు కోరారు.

టీడీపీ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తా: చల్లా



ప్రజలతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం చల్లా రామచంద్రారెడ్డి ఇంటి వద్ద నియోజక వర్గంలోని పులిచెర్ల, సోమల, రొంపిచెర్ల, చౌడేపల్లి మండలాలకు చెందిన పలువురు ఆయన్ను కలిసి పలు సమస్యలు విన్నవించారు. సోమల, చౌడేపల్లి మండలంలోని భూసమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. పులిచెర్ల మండలంలోని కల్లూరు, రొంపిచెర్ల మండల కేంద్రంలోని ఈద్గాల ప్రార్థన స్థలాల్లో సీసీ రోడ్లు వేయాలని రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, కల్లూరు మైనార్టీ నాయకులు అలీంబాషా, నూరు, అష్రఫ్ కోరారు. బండకిందపల్లె పంచాయతీలో సచివాలయం, విలేజ్ క్లినిక్‌లలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు రమణ, నాయకులు గౌస్‌పీర్‌ఖాన్, షేక్‌కరీముల్లా, రామమూర్తి పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులపై దాడులు దారుణం



ధర్నా చేస్తున్న నాయీబ్రాహ్మణ కులస్తులు

పుంగనూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ కులస్తులపై దాడి చేయడం హేయమైన చర్యగా పరిగణించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. బుర్రవారిపల్లెలో ఓ పెళ్లి కుమారుడు తండ్రి చిన్న రెడ్డెప్పతో పాటు కొంతమంది నాయి బ్రాహ్మణుడు శంకరప్పపై దాడి చేశారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘ నాయకులు హేమంత్‌కుమార్, గంగాధర్, బద్రి, నాగవేణి, సరళ, చిన్ని, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇందిరా ప్రియదర్శిని

పలమనేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలమనేరు ఐసీడీఎస్ పరిధిలోని మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఇందిరా ప్రియదర్శిని, నాగమణి ట్రస్టు నిర్వాహకులు శ్రీపురం సీతారామయ్య, ఎస్ఐ స్వర్ణతేజ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నరేంద్రబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుధారాణి, కళాశాల అధ్యాపకురాలు రుక్మిణి, బాలికోన్నత పాఠశాల హెచ్.ఎం. కుప్పమ్మ, మూడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

మామిడిచెట్ల దగ్ధం



ఉప్పరపల్లె గుట్ట సమీపంలో దగ్ధమైన మామిడి చెట్లు

సోమల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ కందూరు రోడ్డు మార్గంలోని ఉప్పరపల్లె గుట్ట వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో సమీపంలోని మామిడి తోటల్లోకి మంటలు వ్యాపించాయి. రైతులు మంటలు ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఈక్రమంలో దొంగరి మనోహర్‌కు చెందిన 15 మామిడి చెట్లు, గన్నా మల్లమ్మకు చెందిన 20 చెట్లు, దొంగరి విజయలక్ష్మీ 14 చెట్లు, చిన్నిన్నిగారి బాలసుబ్రహ్మణ్యంకు చెందిన మామిడి చెట్లు, కొబ్బరిచెట్లు, సూర్యప్రకాశ్ తోటలోని పలు మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. జనార్దన్ తోటలోని విద్యుత్ తీగలు, డ్రిప్ పైపులు కాలిపోయాయి. అధికారులు స్పందించిపరిహారం అందజేయాలని కోరుతున్నారు.

● పుంగనూరు రూరల్: మండలంలోని రాగానిపల్లె సమీపంలోని దండుపాళ్యం వద్ద నీలగిరితోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు అగ్నిమాపకాధికారి సుబ్బరాజు తెలిపారు. దండుపాళ్యంలోని రెడ్డిభాస్కర్‌గుప్తాకు చెందిన నీలగిరి తోటకు గుర్తుతెలయని వ్యక్తులు నిప్పు అంటించారు. మంటలను అదుపు చేశారు. సిబ్బంది సురేశ్‌బాబు, సుబ్రహ్మణ్యం, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పుంగనూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోర్టు ఆవరణలో 8న శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని కోరారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పుంగనూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరడం హర్షనీయమని పుంగనూరు వాల్మీకి సంఘ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత కొన్నేళ్లగా వాల్మీకులు ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆందోళనలు చేస్తున్నామని వాపోయారు. నాయకులు డాక్టర్ శివ, శివశేఖర్, రాజశేఖర్, రెడ్డెప్ప, నాగరాజ, వెంకటరమణ పాల్గొన్నారు.

పురందేశ్వరికి టీడీపీ నేతల సాదర స్వాగతం



చిత్తూరు సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి టీడీపీ నేతలు సాదర స్వాగతం పలికారు. శుక్రవారం మిట్టూరులో ఉన్న ఎస్‌పీసీ కల్యాణ మండపంలో జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, నేతలు మోహన్‌రాజ్, త్యాగరాజన్, రాజశేఖర్, మేషాక్, అమ్ములు, విజయకుమార్ ధరణి ప్రకాష్ , దేవరాజ్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



● అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర

చిత్తూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర హెచ్చరించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్‌డ్ ఇంజనీర్లతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే కట్టడాలను టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు వార్డుల్లో పర్యటించి గుర్తించాలన్నారు. రోడ్ల ఆక్రమణలకు గురైతే సంబంధిత సెక్రటరీలపై చర్యలు తప్పవన్నారు. శుభప్రద, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు కౌంటర్లు పనిచేస్తాయి: పన్నుల వసూళ్ల కోసం నగరపాలక కార్యాలయంలో సెలవు రోజులైన శని, ఆదివారాల్లో కూడా కౌంటర్లు పనిచేస్తాయని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల వారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

శ్రీరంగరాజపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మంగుంట గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామివారికి వసంతోత్సవం, హోమం నిర్వహించారు. అనంతరం హనుమంత వాహనంపై ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకుడు వెంకటచలపతి, ఎగువ మంగుంట, దిగువ మంగుంట గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రంలో డీఎస్పీ పరిశీలన



వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ పరిశీలించారు. అక్కడి ఉద్యోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

స్ఫూర్తిదాయక సినిమాల ప్రదర్శన

చిత్తూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు స్ఫూర్తిదాయకమైన సినిమాల ప్రదర్శన నిర్వహించారు. మహిళలు సమాజంలో ఎదుర్కొనే సవాళ్ల, విజయగాథలను తెలియజేశారు.

వ్యవసాయంలో నైపుణ్యాన్ని పెంచుకోండి



వంగతోటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నగరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నైపుణ్యాన్ని పెంచుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. నగరి డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్వోలు, రైతులతో శుక్రవారం స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్‌పై సమీక్షించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఏగ్రేడ్ రైతుల పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగరి, చిత్తూరు ఏడీఏలు సౌభాగ్యలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి,వ్యవసాయ అధికారి రామచంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసం అవని డిపాజిట్ పథకం

నగరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళల కోసం అవని డిపాజిట్ పథకం ప్రవేశపెట్టినట్లు నగరి కేంద్ర సహకారబ్యాంకు మేనేజర్ సందీప్ తెలిపారు. డీసీసీబీ బ్యాంకులో శుక్రవారం జరిగిన సమావేశంలో నగరి, ఎం.అగరం, కోసలనగరం, సీతవేలు తులసిపిళ్లై, సుబ్రహ్మణ్యం, రాధ, సూపర్‌వైజర్ ఆనంద్‌తో సమీక్షించారు. అంతర్జాతీయ మహిళాది నోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సాధారణ డిపాజిట్‌పై 7.80శాతం, సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.50శాతం వడ్డీ ఇస్తారన్నారు. అదే అవని పథకం కింద మహిళలకు 8.30శాతం, సీనియర్ సిటిజన్లకు 8.40శాతం వడ్డీరేటు ఇస్తారని తెలిపారు. డిపాజిట్ కాలపరిమితి 333 రోజులు మాత్రమేనన్నారు. ఈనెలాఖరు వరకే ఈ పథకం ఉంటుందని తెలిపారు. రూ.10,000లకు పైబడి డిపాజిట్ ఉండాలన్నారు. డిపాజిట్‌కు ఇన్సూరెన్స్ రక్షణ ఉందని చెప్పారు.

మహిళా దినోత్సవానికి కేకులు, బొకేలు సిద్ధం



చిత్తూరుకల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం శుక్రవారమే కేక్‌లు, స్వీట్లు, బొకేలను ఆయా దుకాణదారులు సిద్ధం చేశారు.

150 మందికి వైద్యపరీక్షలు



బంగారుపాళ్యం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): య మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బంగారుపాళ్యం) వారు శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రత్నం మెమోరియల్ హాస్పిటల్ డాక్టర్లు జనీతా, ఉదయ్‌లు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎస్బీఐ చీఫ్ మేనేజర్ సురేంద్రబాబు, ఫీల్డ్ ఆఫీసర్ సతీష్, వైద్య సిబ్బంది మోహన్‌కుమార్, రాజవేల్, ప్రసన్న, స్వాతి, పూజ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి / ముందస్తుగా నిర్వహించిన మహిళా దినోత్సవంలో వక్తలు





డాక్టర్ ఆశాను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జీవనజ్యోతి - ఖజానాశాఖలో ఉద్యోగినులకు సన్మానం - పెనుమూరు సప్తగిరి బ్యాంకులో ఉద్యోగినుల సంబరాలు

చిత్తూరు సెంట్రల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉన్నట్లేనని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాలలో శుక్రవారం ముందస్తుగా నిర్వహించారు. మహిళలకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కె.ఆశా హాజరై.. మహిళా అధ్యాపకులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే పలు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ముందస్తుగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా ఖజానాశాఖ డీడీ చాంబర్‌లో మహిళా ఉద్యోగినులను సన్మానించారు. జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీడీ ఎం.రామచంద్రరావు, ఏటీవో హరనాథ రెడ్డి, రాష్ట్ర ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డి.నరేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు డి.చెంగల్రాయుడు, కార్యదర్శి జి.పయని, సభ్యులు పాల్గొన్నారు.

పెనుమూరు: మహిళా ఉద్యోగులే అధికంగా ఉన్నారని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, సప్తగిరి బ్యాంకు మేనేజరు నాగరాజు అన్నారు. పెనుమూరు సప్తగిరి బ్యాంకులో వెలుగు, బ్యాంకు మహిళా ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అసిస్టెంట్ బ్యాంకు మేనేజరు రమ్య, ఏపీఎం చిరంజీవి, ఉద్యోగులు రోజా, చిన్ని, సిబ్బంది పాల్గొన్నారు.

నగరి: నగరి డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార సంఘం ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులను సన్మానించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్, నగరి డీఎస్పీ అజీజ్, సీఐ మహేశ్వర్ పాల్గొన్నారు. డీఎస్పీ తన సెల్‌ఫోన్ నెంబరు విద్యార్థినులకు ఇచ్చి.. అత్యవసరమైతే ఫోన్ చేయాలని సూచించారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో విజేతలైన ఎం.జ్ఞానప్రసన్న, ఎన్.మానస, పూర్ణిమకు బహుమతులను అందజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ డాక్టర్ ధనంజయరెడ్డి, కో-ఆర్డీనేటర్ డాక్టర్ సీఎస్‌లత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యంఆచారి పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ: జిల్లా రవాణా శాఖ (ఆర్టీవో) కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. ఉద్యోగినులను సన్మానించారు. డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వరరావు, నరసింహులు, దీపిక, ఏవోలు పురుషోత్తం, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.





నగరి డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులకు సన్మానం - కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల పెయింటింగ్ చూపిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు - చిత్తూరు ఆర్టీవో కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగినులు, సిబ్బంది

ఫారంపాండ్ పనుల తనిఖీ



వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం సీడీకం డ్రిగ, కేశవకుప్పం ప్రాంతాల్లో జరుగుతున్న ఫారంపాండ్ పనులను డ్వామా ఏపీడీ సునీల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్ తవ్వించుకుంటే పది కొబ్బరి మొక్కలు, వెజిటబుల్ కిట్ అందిస్తామని చెప్పారు. ఏపీవో జాహ్నవి పాల్గొన్నారు.

దాతకు సన్మానం



పాఠశాల సిబ్బందితో రామకృష్ణమ నాయుడు దంపతులు

పెనుమూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉగ్రాణంపల్లె హైస్కూల్‌లో విద్యార్థుల కోసం గ్రంథాలయ భవనాన్ని తన సొంత నిధులు రూ.12లక్షలతో గుంటూరువాండ్లవూరుకు చెందిన రామకృష్ణమనాయుడు నిర్మించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన్ను పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో భాస్కర్‌నాయుడు, హెచ్ఎం మంజుల, టీచర్లు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



నగరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని వినాయకపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను విజయపురం మండలానికి చెందిన విశ్రాంత టీచర్ చంద్రయ్య వితరణ చేశారు. హెచ్ఎం ప్రసన్నకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

తెల్లగుండ్లపల్లెలో లేగ దూడల ప్రదర్శన



వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ తెల్లగుండ్లపల్లెలో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిధులుగా పశుసంవర్ధక శాఖ పుత్తూరు ఉప సంచాలకుడు డాక్టర్ గోవిందయ్య, తిరుపతి పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకుడు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. పేయ దూడల యాజమాన్యంపై పాడి రైతులకు అవగాహన కల్పిచారు. రైతులకు మినరల్ మిక్చర్, గ్రోత్ టానిక్ తదితరాలను అందజేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'వడ్డెరలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'

చిత్తూరు అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చిత్తూరులో జిల్లా అధ్యక్షుడు రవీంద్రరాజు, నేతలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఇందులో ఓ స్థానాన్ని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళికి ఇవ్వాలని కోరారు. నాయకులు హరిబాబు, గుర్రప్ప, రుద్రయ్య, కుసుమ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు



గౌతమ్‌ను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మొదటి భార్యను అదనపు కట్నం కోసం వేధించడంతోపాటు పిల్లలు పుట్టలేదన్న కారణంతో రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిని అరెస్టు చేశారు. కార్వేటినగరం ఎస్ఐ పి.రాజ్‌కుమార్ శుక్రవారం మీడియాకు వివరాలు తెలిపారు. పుత్తూరు పట్టణంలోని షాపుస్ట్రీట్‌కు చెందిన పి.సుబ్రహ్మణ్యం, అరుణ దంపతుల కుమార్తె పి.మౌనికను కార్వేటినగరం మండలం సురేంద్రనగరం కాలనీకి చెందిన పి.బ్రహ్మయ్య కుమారుడు పూడి గౌతమ్ 2016లో వివాహం చేసుకున్నాడు. తర్వాత తన కుటుంబీకులతో కలసి మౌనికను అదనపు కట్నం కోసం వేధిస్తూ వచ్చాడు. అనంతరం పిల్లలు పుట్టలేదన్న కారణం చూపి.. మరో యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయమై మౌనిక కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గౌతమ్‌ను అరెస్టు చేసి.. శుక్రవారం రిమాండుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

వంద దుకాణాలకు జరిమానా



వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వంద దుకాణాలకు టౌన్ న్యూసెన్స్ యాక్టు కింద జరిమానా విధించినట్లు కార్వేటినగరం ఎస్ఐ పి.రాజ్‌కుమార్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. రోడ్డుకు అడ్డంగా వాహనాదారులకు ఇబ్బంది కలిగించేవిధంగా దుకాణాల బోర్డులను ఉంచడం, మోటరు సైకిళ్లను పార్క్ చేయడంపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద జరిమానాలను విధించారు.

గాయపడ్డ ఇద్దరి మృతి

బంగారుపాళ్యం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వెలుతురుచేనుకు చెందిన బాలకృష్ణ గౌండర్(74) గత నెల 26వ తేదీన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొని గాయపడ్డాడు. బాధితుడిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీకి, తర్వాత తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రయోజనం లేకపోవడంతో కుటుంబీకులు స్వగ్రామానికి తీసుకురాగా, శుక్రవారం మృతి చెందారు. ● పలమనేరులోని కోకా కాలనీకి చెందిన మున్నెమ్మ(64) మొగిలిలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు వచ్చి జాతీయ రహదారి దాటుతుండగా చిత్తూరు వైపు వెళుతున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మునెమ్మ.. తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొగిలి ఘాట్‌లో బియ్యం లారీ బోల్తా

● డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలు




బోల్తాపడ్డ లారీ - రోడ్డుపై పడి ఉన్న బియ్యం బస్తాలు

బంగారుపాళ్యం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై- బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్‌లోని శ్రీనిఫుడ్ పార్క్ సమీపంలో గురువారం రాత్రి ఓ బియ్యం లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ లారీ బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో లారీలోని బియ్యం బస్తాలు రోడ్డుపై చిందరవందరగా పడిపోయాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని తొలగించి.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

నేడు వెదురుకుప్పం, కార్వేటినగరం మండల సమావేశాలు

వెదురుకుప్పం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో సమావేశపు మందిరంలో జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో అమరనాథ్ తెలిపారు. అలాగే కార్వేటినగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కూడా శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో సమావేశపు మందిరంలో జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు.

సంతకు 10న వేలం పాట

నింద్ర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నింద్రలోని వారపు సంత వేలం పాట ఈనెల 10న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ధరణి తెలిపారు. సచివాలయ కార్యాలయం ఆవరణంలో వేలం పాట జరుగుతుందని, ఆసక్తి ఉన్నవారు ధరావత్తు రుసుం చెల్లించి పాల్గొనాలని సూచించారు.

భక్తులకు బిస్కెట్ల వితరణ

చిత్తూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం తమిళనాడు నుంచి కాలినడక వెళ్తున్న భక్తులు శనివారం చిత్తూరుకు చేరుకున్నారు. వీరికి తాగునీరు, బిస్కెట్లను మాజీ కౌన్సిలర్ పార్థిసారథి నాయుడు వితరణ చేశారు.

ఆరాధన ఉత్సవాలు

విజయపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కోసలనగరం పంచాయతీ మిట్టూరు రామకృష్ణమ్మ ఆశ్రమంలో శుక్రవారం 45వ ఆరాధన ఉత్సవాలను కార్యనిర్వాహకుడు వాసుదేవ స్వామి నిర్వహించారు. ఉదయం రామక్కమ్మకు అభిషేకం, పూజలు చేశారు. రాత్రి పుర వీధుల్లో ఊరేగించారు. ఏపీతోపాటు తమిళనాడు నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

విజయపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీఎంపురంలో శుక్రవారం మండల పశువైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధులు, నట్టల నివారణ గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

పాలసముద్రం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తిరమలరాజుపురం, టీవీఎన్ఆర్‌పురం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

అఖండ నామ సంకీర్తన

చిత్తూరు కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్ కాలనీ చైతన్య వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి అఖండ నామ సంకీర్తన నిర్వహించారు. సత్యసాయి భజన మండలి, బాలవికాస్, మహిళా, యువజన విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలకార్మికుడిని బడిలో చేర్పించిన టీచర్లు

నగరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నగరి మండలానికి చెందిన జంషీర్ అనే బాలకార్మికుడిని టీచర్లు గుర్తించి శుక్రవారం పాఠశాలలో చేర్పించారు. తల్లిదండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ సంరక్షణలో ఉంటూ.. ఓ దుకాణంలో పని చేస్తున్నట్లు గుర్తించారు. ఈ బాలుడిని ఎం.కొత్తూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. సీఆర్పీ మునస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ హేమావతి, మహిళా పోలీసు పాల్గొన్నారు.

సారాతో ప్రాణానికే ప్రమాదం



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసాచారి

చిత్తూరు సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సారా తాగడం ప్రాణానికే ప్రమాదమని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి చెప్పారు. నవోదయం 2.0లో భాగంగా శుక్రవారం గుడిపాల మండలం రాసనపల్లెలో సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఎస్ శ్రీనివాస్, ఏఈఎస్ కృష్ణ కిషోర్, సీఐలు శ్రీహరి రెడ్డి, పురుషోత్తం, ఎస్ఐ మోహన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.4.42 లక్షలు

బంగారుపాళ్యం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం జరిగిందని వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో మునిరాజ తెలిపారు. 40 రోజులకు హుండీ ద్వారా రూ.4,42,839 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. భక్తుల హుండీ ద్వారా రూ.3,82,541, అన్నదానం హుండీ ద్వారా రూ.60,298 వచ్చినట్లు వివరించారు. దేవదాయ శాఖ అధికారి సుమన్‌ప్రియ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.

సనాతన ధర్మాన్ని కాపాడదాం : సినీ నటుడు పృథ్వీరాజ్



పృథ్వీరాజ్‌తో అనిల్ కుమార్ తదితరులు

చిత్తూరు కల్చరల్/ ఐరాల(కాణిపాకం): మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడదామని సినీ నటుడు పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గిరింపేట బజారువీధిలోని ఆదినాగ పరమేశ్వరి ఆలయ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకుడు అనిల్‌కుమార్ స్వాగతం పలికారు. అలాగే కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని కూడా పృథ్వీరాజ్ దర్శించుకున్నారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

పుంగనూరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరడం హర్షణీయమని పుంగనూరు వాల్మీకి సంఘ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వాల్మీకులు ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆందోళనలు చేస్తున్నామని వాపోయారు. నాయకులు డాక్టర్ శివ, శివశేఖర్, రాజశేఖర్, రెడ్డెప్ప, నాగరాజ, వెంకటరమణ పాల్గొన్నారు.